# నాన్న

చింతా రాంబాబు



**శ్మశానంలో కట్టెలమీద నిర్జీవంగా పడి ఉన్న తండ్రి శవాన్ని చూస్తున్న ప్రకాశం తట్టుకోలేకపోతున్నాడు. పొరలుపొరలుగా ఏడుపు తన్నుకొస్తోంది. బలవంతాన ఏడుపును దిగమింగుకొంటున్నాడు.**

శ్మశానానికి వచ్చినవాళ్లంతా తండ్రి శవంమీద తలకొక కట్టెను తీసుకెళ్లి ఉంచుతున్నారు. ఎవరో తన చేతికి కూడా ఓ కట్టెనందిస్తే ప్రకాశం కిందపడిపోయే స్థితిలో నడుచుకుంటూ వెళ్లి తండ్రి శవంమీద కట్టెను ఉంచాడు. అలా కట్టెలమధ్య తండ్రిని చూసిన ప్రకాశం అప్పటివరకూ కాపాడుకున్న నిగ్రహాన్ని కోల్పోయి ఒక్కసారి గట్టిగా ఏడ్చేశాడు.

తన చిన్నతనంలో తండ్రి ఒక్కడికి మాత్రమే మంచంమీద పరుపు ఉండేది. అలా పందిరిమంచంమీద మాత్రమే పడుకున్న తండ్రిని ఇప్పుడు- పైన కట్టెలు, కింద కట్టెలు నొక్కిపడేస్తున్నాయి.

భావోద్వేగంతో ప్రకాశం కదిలిపోతున్నాడు. పెదాలు రెండూ వణుకుతున్నాయి. దుఃఖంతో కన్నీళ్లు ఆగడంలేదు.

కట్టెలమధ్యనుండి ఆయన చేతులు మాత్రమే బయటకు కనిపిస్తున్నాయి.

ప్రకాశానికి నిన్న మొన్నటిసంగతిలా ఈరోజుకీ బాగా గుర్తుంది. ఆ రెండు చేతులే తనను వళ్లో కూర్చోపెట్టుకుని తనచేత 'అ ఆ'లు దిద్దించాయి.

ఇంకో రెండు నిముషాల్లో కట్టెలతోపాటు అవీ మాడి మసికాబోతున్నాయి.

ఇంక నిబ్బరించుకోలేక అక్కడే కూలబడిపోతున్న ప్రకాశాన్ని ఎవరో పట్టి పక్కకి తీసుకెళ్లారు.

కాసేపయ్యాక అందరితోపాటు ప్రకాశం కూడా కాలవలో స్నానం ముగించి ఇంటికి చేరుకున్నాడు.

ఇల్లంతా బంధుమిత్రుల శోకాలతో నిండిపోయి ఉంది. ఆ శోకాల మధ్యనే తన తండ్రితో వాళ్లకు గల అనుభవాలను గుర్తుకి తెచ్చుకుని మరీ రోదిస్తున్నారు.

ఇక తన తల్లినైతే ఎవరూ పట్టుకోలేకపోతున్నారు. నిన్నటివరకూ ఎంతో అన్యోన్యంగా కలిసిమెలిసి ఒకటిగా బతికిన దంపతులు! ఈ రోజున ఆమెకు ఎవరూ తీర్చలేని లోటు.

ఓ భార్యగా ఆమె తన తండ్రికి పూర్తి బాధ్యతను నెరవేర్చింది. అలాగే తనకు

చాతనైనంతవరకూ తల్లి ఆయన్ని సంతోషపెట్టడానికే ప్రయత్నించింది.

మరి కొడుకుగా ఈ రెండింటినీ తనెంతవరకూ నెరవేర్చాడు?

తండ్రి కాడెను ఎత్తి భుజంమీద పెట్టుకున్నదగ్గరనుండి ఇదే ప్రశ్న ప్రకాశాన్ని వేధిస్తోంది.

అందరితోపాటు దీపం వెలిగించిన తండ్రి ఫొటోకి ప్రకాశం కూడా నమస్కరించాడు.

ఆ ఫొటో తనే తీశాడు.

అప్పుడు ఊళ్లో ఉన్న తన అన్నదమ్ములిద్దరూ తల్లిదండ్రితో కలిసి తిరుపతికి వెళ్తున్నామని లెటరు రాస్తే ఆ రోజుకి తను ఫామిలీతో హైదరాబాదునుండి సరాసరి తిరుపతికి చేరుకున్నాడు. ఆ సందర్భంలో తిరుపతిలో తీసిన ఫొటో అది.

తిరుపతికి వచ్చిన తన వాళ్లంతా సింగిల్‌గానూ, జంటలుగానూ, గ్రూపులుగానూ రకరకాలుగా ఎన్నో ఫొటోలు దిగారు. దిగడం కాదు, తనే తీశాడు. తల్లి వద్దన్నా వినకుండా వేరువేరు ప్రదేశాల్లో ఆమెను బలవంతంచేసి సింగిల్‌గా కూడా ఫొటోలు తీశాడు. అలాగే తండ్రిని కూడా తీయాలన్న ధ్యాసే తనకు లేకుండా పోయింది.

ఫొటో దిగడమంటే తన తండ్రికి చాలా ఇష్టమన్న సంగతి కూడా తనకు తెలుసు. అయినా విస్మరించాడు. తన చిన్నతనంలో ప్రతి రెండు సంవత్సరాలకొకసారి తండ్రి తమందరినీ ఫొటో స్టూడియోకి తీసుకెళ్లి ఎన్నో ఫొటోలు తీయించేవాడు. తల్లి వద్దని విసుక్కుంటున్నా ఆయన సింగిల్‌గా రకరకాల ఫోజుల్లో ఫొటోలు దిగేవాడు. అవన్నీ ఈ ఇంటి గోడలకి ఇంకా అలాగే వేలాడుతున్నాయి. ఏదన్నా శుభసందర్భాలలో ఎవరి చేతిలోనైనా కెమెరా కనిపిస్తే చాలు, వదిలేవాడు కాదు. అందరూ నవ్వుకుంటున్నా సరే, ఫొటో దిగటం మాత్రం మానేవాడు కాదు.

అలాంటిది ఆ రోజున "బాబూ ప్రకాశం! సింగిల్‌గా నాది కూడా ఓ ఫొటో తీయరా!" అని తనంతట తానుగా ఆయన అడిగేవరకూ తనకు గుర్తుకు రాలేదు.

నిర్లక్ష్యం చేశాడు.

ఆ రోజున ఆయన అడిగి తీయించుకున్న ఫొటో అది.

ఇప్పుడిలా ఉపయోగపడింది.

ప్రకాశం కళ్లల్లో నీళ్లు నిండుకున్నాయి.

ఇంటిపక్కవాళ్లే ఆ పూటకి వంటలు చేసి పంపారు. పదిమందితోపాటు ప్రకాశం కూడా బలవంతంగా రెండుముద్దలు తిన్నాడు.

ఓ పక్క పెద్దవాళ్ల శోకాలతోపాటు ఇల్లంతా పిల్లల కేకలు, కేరింతలతో అల్లరిగా కూడా ఉంది. ఆ పసివాళ్ల కేకలు, కేరింతలే కొంతమందికైనా లేచి పనిచేసుకునే శక్తినిస్తున్నాయి. లేకపోతే వాళ్లు కూడా నిస్తేజంగా మంచాలకి, చాపలకి అతుక్కుపోయేవాళ్లు.

ఎవరికి వాళ్లు తండ్రితో తమకు గల అనుభవాలను రెండో వ్యక్తితో చెప్పుకుని ఉపశమనం పొందటానికి ప్రయత్నిస్తున్నారు. ఎంత చెప్పుకున్నా అంత త్వరగా ఆ బాధ తీరేనా!

"డాడీ! సూట్‌కేస్ కీస్ ఇమ్మంది, మమ్మీ!" పదేళ్ల ప్రకాశం పెద్దకొడుకు పరుగున వచ్చి అడిగాడు.

విడిచిన పాంటుజేబులో ఉండిపోయిన కీస్‌కోసం పక్కగదిలోకెళ్లాడు ప్రకాశం. అక్కడ గోడకి తగిలించి ఉన్న పాంటు జేబులోనుండి కీస్ తీసి కొడుక్కి అందిస్తుంటే అక్కడే టేబుల్‌మీద పడి ఉన్న తండ్రి కళ్లజోడు ప్రకాశం కంటబడింది.

దాన్ని చూడగానే ప్రకాశం గుండె కలుక్కుమంది. గుండెల్లో సన్నటి సూదులు దిగుతున్నంత బాధ.

తమంతా నెలరోజులక్రితమే పండక్కి ఇక్కడికి రావటం జరిగింది. అప్పుడు తండ్రి పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడు.

"ఒరేయ్ ప్రకాశం! నా కళ్లద్దాలు మార్పించుకోవాలనుకుంటున్నానురా! ఈ అద్దాలతో సరిగ్గా కనిపించటంలేదు. నీవు వెళ్లే లోపల ఓసారి మీ డాక్టరు ఫ్రెండు దగ్గరికెళ్లొస్తాం!' ' అన్నప్పుడు "సరే!" అంటూ తలూపాడు.

మళ్లీ ఆ సంగతి తిరుగు ప్రయాణం కో తను హైదరాబాదు బస్సెక్కిన తర్వాత కానీ గుర్తుకి రాలేదు.


మధ్యలో ఓసారి తండ్రి "ఈ సాయంత్ర మనం డాక్టరు దగ్గరికెళ్లటానికి నీకు వీలవుతుందిరా ప్రకాశం?" అంటూ అడిగినప్పుడు, "లేదు, నాన్నా! ఈ సాయంత్రం మీ కోడల తీసుకుని ఊళ్లో ఉన్న మా ఫ్రెండింటికి వసని చెప్పాను. తర్వాత వెళ్దాం!" అన్నాడు.

అంతే! ఆ తర్వాత మళ్లీ ఆ సంగతి తకి గుర్తురాలేదు. తండ్రి కూడా అడగలేదు. గ్తుకు వచ్చినా అంత శ్రద్ధగా తీసుకెళ్లేవాడు కాదేమో!

ఎందుకంటే తనతో కలిసి చదువుకు ఆ డాక్టరు ఫ్రెండ్‌ని తను కలవటం కూడా ఒగింది. అప్పుడు తండ్రి సంగతి గుర్తుకువచ్చినా తీసుకెళ్లడానికి అశ్రద్ధ వహించాడు. ఆ కడాక్టరు తన ఫ్రెండు కాబట్టే తండ్రి తనను అడిడు. లేకపోతే ఎవర్నీ ఏదీ అనవసరంగా అడిగేమనిషి కాడు. అయినా తను పట్టించుకోలేదు.

అదే తను ఊళ్లో ఉన్నప్పుడు తల్లి క్ల నొప్పులు, నడుంనొప్పి అంటే రెండుసా డాక్టరు దగ్గరికి తీసుకెళ్లటమే కాకుండా వచ్చేముదు మందులు కూడా కొనిచ్చి మరీ వచ్చాడ

నిన్నటివరకూ తల్లినీ, తండ్రినీ త సమానంగానే ప్రేమిస్తున్నాననుకునేవా. ప్రేమిస్తే



## చదువుకుందుకు

తండ్రి: ఎక్కడికిరా వెళ్తున్నావ్?
కొడుకు: సినిమాకి!
తండ్రి: మరి చేతిలో ఆ
పుస్తకమెందుకురా?
కొడుకు: పరీక్షలుకదా...ఇంటర్వెల్‌లో
చదువుకుందుకు!

**నారె మంజులారావు**, కొండపర్తి

మరి ఈ వ్యత్యాసం ఏమిటి? తల్లితో ఉన్న చనువు తండ్రితో లేకపోవటమే దీనికి కారణమా? పెద్దయి ప్రయోజకులైన తర్వాత కూడా తండ్రిదగ్గర చనువురన్న ముసుగులోనే ఇంకా ఉండిపోవాలా?

తన చిన్నతనంలో చదువుకోకపోతే తల్లి కోప్పడేది. వినకపోతే కొట్టేది. కొట్టాక కొట్టినందుకు బాధపడుతూ మళ్లీ దగ్గరికి తీసుకునేది.

అదేని తండ్రి కూడా చేస్తే తమకు చదువులబ్బేవా?

చదువు విషయంలో తండ్రి చాలా కఠినంగా ఉండేవాడు. స్కూలు హోమ్‌వర్క్ విషయంలో కానీ అడిన ప్రశ్నకి జవాబు చెప్పే విషయంలో కానీ ఏ మాత్రం అలక్ష్యం కనిపించినా సహించేవాడు కాదు. కాలేజికొచ్చేసరికి తల్లితో మాటలు చెప్పి, మభ్యపెట్టో డబ్బులు గుంజి సినిమాలు, కార్లు అంటూ కాలేజీ ఎగ్గొట్టి తిరుగుతున్నా తల్లి చూసీ చూడనట్టు ఊరుకునేది.

ఇదే ఆక్ష తండ్రి కూడా కనపరిచితే తమ అన్నదమ్ములు ముగ్గురూ ఇంత ఉన్నతస్థితికి వచ్చేవారా?

ఏ రోజైతే తాము గాడి తప్పుతున్నట్లు తండ్రికి తెలిసిందో ఆరోజే అందరినీ నిలబెట్టి దండించాడు తర్వాత కట్టడి చేశాడు. తమ బంగారు భవిష్యత్తుకి ఆ కట్టడి, క్రమశిక్షణ చాలా అవసరం అని అప్పట్లో తమకు తెలియదు. తండ్రిమీద కోపంగా ఉండేది.

మరి ఇదే తండ్రి చిన్నతనంలో తనకొకసారి జ్వరం వచ్చి ఫై రోజులైనా తగ్గకపోయేసరికి తన తల్లికన్నా ఎక్కువ కంగారుపడిపోయాడు. భయంకొద్దీ నలుగురు డాక్టర్లను మార్చాడు.

తనకింకా బాగా గుర్తుంది. జ్వరం తగ్గటానికి తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి ఒకటికి నాలుగుసార్లు అడిగేసరికి డాక్టర్లు తండ్రిని విసుక్కునేవాళ్లు. ఆ ఆదుర్దాలో తండ్రి ఇవేమీ పట్టించుకునేవాడు కాడు.

మరి డాక్టరు దగ్గరికెళ్దామని రెండుసార్లు అడిగిన తన తండ్రికి తనేం చేశాడు?

ప్రకాశం గుండె చెరువైంది.

ఆర్తిగా రెండు చేతులతో తండ్రి కళ్లజోడుని తడిమి చూశాడు. అవే అద్దాలు! మార్పించుకోనేలేదు.

ప్రకాశం కళ్లు రెండూ తడి అయ్యాయి.

ఆ రాత్రి అందరూ కింద చాపలు పరుచుకుని పడుకున్నారు. ఉన్న మూడు గదులు చాలక కొంతమంది వసారాలో కూడా పడుకోవాల్సివచ్చింది.

క్రితంసారి సంక్రాంతి పండగకి వచ్చినప్పుడు కూడా ఇలాగే పడుకున్నారు. ఆ రోజు తమందరితోపాటు తండ్రి కూడా ఉన్నాడు.

ఇంటికొచ్చిన కూతుళ్లనూ, అల్లుళ్లనూ, కోడళ్లనూ చూసిన తండ్రి ఆనందానికి పట్టపగ్గాలు లేవు. ఆనందంతో నిండిపోయిన ఆ మొహం ఇంకా ప్రకాశం కళ్లముందు మెదులుతూనే ఉంది.

ఈసారి పండగకి కూతుళ్లు, అల్లుళ్లతోపాటు కోడళ్లకి కూడా తండ్రి బట్టలు తీశాడు. తమ అన్నదమ్ములతోపాటు పండగరోజున అందరూ కొత్తబట్టలు వేసుకున్నారు. తండ్రిమాత్రం తను చాలాకాలంగా చూస్తున్న ఆయనకున్న నాలుగు జతల్లో ఓ జత వేసుకున్నాడు.

ఆ రోజున దానిగురించి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు, పీలవ్వలేదు.

ఇప్పుడు తరచి చూస్తుంటే అప్పుడు చిన్న విషయాలనుకున్నవి తను తండ్రిపట్ల చేసిన పెద్ద పొరపాట్లుగా ప్రకాశం మనసుని కలచివేస్తున్నాయి.

తల్లితో సమానంగా తండ్రికి సమాన ప్రతిపత్తి, సమాన ప్రేమానురాగాలను పంచలేకపోయానన్న నిజం అతని హృదయాన్ని చీల్చివేస్తోంది.

పండగకి ఇక్కడికి వచ్చేముందు పిల్లలతోపాటు తన తల్లికి కూడా చీర కొని తీసుకువచ్చాడు. అలాగే తండ్రికి కూడా తీసుకురావాలన్న ఆలోచనే రాలేదు. నిజం చెప్పాలంటే తల్లికన్నా తన తండ్రికే బట్టలవసరం.

ఆ సంగతి తన మిగిలిన ఇద్దరన్నదమ్ములు కూడా విస్మరించారు.

తన తండ్రి ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసి రిటైరయ్యాడు. ఆయన ఉద్యోగంలో ఉన్నప్పుడు బస్సులో వెళ్తే టిక్కెట్‌కి డబ్బులు ఖర్చవుతాయని సైకిల్‌మీదే ఆఫీసుకు వెళ్లేవాడు. అలాగే కాఫీ, టీలు బయట హోటల్లో తాగితే ఖర్చని ఎప్పుడన్నా అలిసి తాగాలనిపిస్తే సాయంత్రం ఇంటికొచ్చాకే తాగేవాడు.

అలా సౌకర్యాల సంగతి అటుంచి తమకోసం కనీస అవసరాలను కూడా త్యాగం చేసిన తండ్రి శ్రమని, త్యాగాన్నీ తనెంతవరకు గుర్తించాడు? తనే కాదు, మిగిలిన ఇద్దరు కొడుకులు కూడా గుర్తించలేకపోయారు.

ఇంటిని జాగ్రత్తగా, పొదుపుగా నడపటంలో తల్లితో సమానంగా తండ్రి పాత్ర కూడా ఉంది.

తండ్రి తన సరదాలకి, షికార్లకి ప్రాధాన్యత ఇచ్చినట్లయితే తల్లిమాత్రం ఏం చెయ్యగలిగి ఉండేది? తన అన్నదమ్ములు ముగ్గురూ ఇంత వృద్ధిలోకి రాగలిగేవారా? ఇంత మంచి ఉద్యోగాలు సంపాదించుకోగలిగేవారా? తన అక్కచెల్లెళ్లిద్దరూ అంత మంచి సంసారాల్లో పడేవారా?

ఎందుకో అక్కడే గోడ మేకుకి తగిలించి ఉన్న తండ్రి షర్టుమీద ప్రకాశం దృష్టి పడి శరీరమంతా ప్రకంపనాలతో నిండిపోయింది! గుండె గొంతులోకి వచ్చింది.

ఫాన్‌గాలికి ఆ షర్టు రెపరెపలాడుతోంది. దాదాపు అయిదారు సంవత్సరాలనుంచి ఆ చొక్కాని చూస్తున్నాడు. భుజాలకింద చిరిగిపోయింది కూడా. అయినా నిన్నటివరకూ ఆ చొక్కా తండ్రి ఒంటిమీదే ఉంది.

ఏ కొడుకూ పట్టించుకోలేదు. తమ సంసారాల్లో, తమ సౌకర్యాల గొడవల్లో మునిగిపోయారు.

దుఃఖం గుండెల్లోకి ఉబికి వచ్చి ప్రకాశం దుప్పట్లోకి మొహం దాచుకున్నాడు.

ఊళ్లో ఉన్న పది రోజులూ ప్రకాశం అన్యమనస్కంగానే గడిపాడు. ఎవరితోనూ సరిగ్గా మాట్లాడలేకపోయాడు. తండ్రి జ్ఞాపకాలు అతణ్ణి బాధిస్తూనే ఉన్నాయి.

తండ్రి కర్మకాండలు ముగిసి హైదరాబాదుకి చేరుకున్న తర్వాతకూడా ప్రకాశం మామూలు మనిషి కాలేకపోతున్నాడు.

స్కూటర్‌మీద హైదరాబాదు రోడ్లమీద

వెళ్తుంటే ఏ చూడదగ్గ ప్రదేశం కనిపించినా బతికుండగా వీటిని తండ్రికి చూపించలేకపోయానన్న బాధ ప్రకాశం గుండెను బద్దలుచేస్తోంది.

రెణ్నెల్ల క్రితమే తండ్రి ఎవరిదో తెలిసినవాళ్ల పెళ్లికోసమని హైదరాబాదుకి వచ్చాడు. తను హైదరాబాదుకి ట్రాన్స్‌ఫరై వచ్చాక తండ్రి రావటం అదే మొదటిసారి.

వచ్చిన తండ్రికి ఉన్న రెండురోజులూ ఇంట్లో ఆయనకు ఏ మాత్రం అసౌకర్యం కలగకుండా జాగ్రత్తగా చూసుకున్నాడే కానీ, సిటీ తిప్పి చూపించలేకపోయాడు.

చూపించాలంటే తను ఆఫీసుకి సెలవు పెట్టాలి. సెలవు పెట్టాలనే ఆలోచించాడు కానీ, చొరవుగా సెలవుపెట్టి చూపించలేకపోయాడు. మళ్లీ ఇంకోసారి ఎప్పుడన్నా తండ్రి హైదరాబాదుకి రాకపోతాడా అన్న నిర్లక్ష్య భావం.

అదే తను హైదరాబాదుకి ట్రాన్స్‌ఫరై వచ్చిన వెంటనే తల్లిని ప్రత్యేకంగా పిలిపించుకుని ఆమెకు మోకాళ్ల నొప్పులన్నా సరే బలవంతంగా చూడదగ్గ అన్ని ప్రదేశాలూ తిప్పి చూపించాడు.

ఆఖరికి ఏ పసివాడు చెప్పినా తల్లినీ, తండ్రినీ సమానంగా చూడమనే చెప్తాడు. నిజంగా తను కూడా అలాగే చూస్తున్నాననే అనుకున్నాడు. మరి చూస్తే ఈ తేడాలన్నీ ఏమిటి?

తనకు తెలియకుండానే తను తల్లినీ, తండ్రినీ సమానంగా ట్రీట్ చెయ్యలేదు. ఈ నిజం తండ్రి పోయిన తర్వాత కానీ తనకు తెలిసిరాలేదు. పోనీ తనలా తండ్రికి దూరంగా ఉండటానికి ఇందులో తండ్రి లోపం ఏదన్నా ఉందా? ముమ్మాటికీ లేదు.

పిల్లలపట్ల తన తండ్రి ఏనాడూ అలక్ష్యభావం ప్రదర్శించలేదు. తెలిసీ తెలియక తామే ఎప్పుడన్నా తండ్రిని నొప్పించి ఉండవచ్చు. కానీ తన తండ్రి ఎప్పుడూ ఏ కొడుకునీ నొప్పించలేదు. తన తల్లిలాగానే తాము ఏడిస్తే ఎత్తుకున్నాడు. అన్నం తిననని మారాం చేస్తే ఎత్తుకుని ముద్దలు తినిపించాడు.

తను ప్రయోజకుడై ఊరు వదిలినప్పుడు, తన తల్లితో సమానంగా బాధపడ్డాడు.

ప్రకాశం కళ్లల్లో నీళ్లు పొంగుకొచ్చాయి.

ఏ దేముడైనా వరం ఇచ్చి తన తండ్రిని మళ్లీ ఈ భూమ్మీదకి పంపిస్తే ...?

తండ్రిని పబ్లిక్‌గార్డెన్‌కి తీసుకెళ్లి రకరకాల పోజుల్లో ఫొటోలు తీయాలని, మంచి ఖరీదైన ఫ్రేమ్‌తో ఏకంగా కొత్త కళ్లజోడునే కొనియ్యాలని, ఓ పది సంవత్సరాలకి సరపడా కొత్తబట్టలు ఆయనకు కొనెయ్యాలని భావోద్వేగంతో ప్రకాశం మనసు కొట్టుకుపోయింది.

మనసెంత కొట్టుమిట్టాడినా, పోయిన తండ్రి తిరిగి రాడే!

చిన్నపిల్లాడిలా ప్రకాశం వెక్కివెక్కి ఏడ్చాడు.

ఇది జరిగిన తర్వాతం ప్రకాశం పక్క పోర్షన్ సుబ్బారావు ఇంటికి అతని తండ్రి రావటం జరిగింది. అంతక్రితమే అతని తల్లి కొడుకు కొత్త కాపురాన్ని చూడటానికని వచ్చి ఓ నెలరోజులు ఉండి వెళ్లింది. ఆమె ఉన్నన్ని రోజులూ సుబ్బారావు ఏది కావాలన్నా తల్లినే పిల్చేవాడు. భార్య ముందుకొచ్చినా ఏ పని కావాలన్నా ఆమె చేతే చేయించుకునేవాడు. ఇంట్లో ఉన్నంతసేపూ అతని నోటివెంట 'అమ్మా!' అన్న శబ్దమే!

తల్లిమీద సుబ్బారావు చూపిస్తున్న ప్రేమకి ప్రకాశం ముచ్చటపడ్డాడు. ఆనందపడ్డాడు. అదే ప్రేమ తండ్రి మీద కూడా చూపిస్తే చూడాలని ఉవ్విళ్లూరాడు.

కానీ సుబ్బారావు తండ్రి ఎప్పుడూ ఒక్కడే వసారాలో చదివిన పేపరే మళ్లీ చదువుతూ కూర్చునేవాడు. ఒక్కరోజూ సుబ్బారావు తీరుబడిగా కాసేపు తండ్రి ఎదురుగా కూర్చుని మాట్లాడటం చూడలేదు.

పాపం తొచనప్పుడల్లా ఆయనే అలా రోడ్డువరకూ నడిచి వెళ్లి వచ్చేవాడు.

అంతేకానీ ఎప్పుడన్నా స్కూటరుమీద తండ్రిని అలా తిప్పిన పాపాన పోలేదు.

భార్యాభర్తలిద్దరూ సినిమాకెళ్లినప్పుడు సుబ్బారావు ఒక్కసారన్నా తండ్రిని కూడా వెంట తీసుకెళ్తాడేమోనని చూసేవాడు. ఊహుఁ ఆ ఊసే లేదు.

తను చేసిన తప్పే మళ్లీ ఈ సుబ్బారావు కూడా చేస్తున్నట్లుగా గ్రహించిన ప్రకాశం అతనిదగ్గర తనకున్న చనువుకొద్దీ సుబ్బారావుని పిలిచి గట్టిగా దులిపేశాడు.

"నిజమే అంకుల్! మీరు చెప్పేవరకూ నాకు తోచనేలేదు!" నిజాయితీగా సుబ్బారావు తన తప్పును ఒప్పుకున్నాడు.

"కానీ అంకుల్! మా అమ్మదగ్గరున్నంత చనువు మా నాన్న దగ్గర లేదే!" నసుగుతూ అన్నాడు.

ప్రకాశానికి వెంటనే కోపం వచ్చేసింది.

"చనువా, సుబ్బారావు! దీన్ని నీకు నీవు ఏర్పరుచుకున్నది. ఒక వయసు వచ్చాక తండ్రి అంటే గౌరవం ఉండాలి కానీ, భయం ఉండకూడదు. మొన్న మీ అమ్మ వచ్చినప్పుడు ఆమెను స్కూటరుమీద ఎక్కించుకుని ఊళ్లో ఉన్న మీ బంధువుల ఇళ్లన్నీ తిప్పావు. అలాగే మీతోపాటు సినిమాలకీ, షికార్లకీ తీసుకెళ్లావు. మీ నాన్నతో కూడా అలా ఎందుకు ఉండకూడదు? తనకిలాంటివి ఇష్టంలేదని మీ నాన్న నీతో ఎప్పుడన్నా చెప్పాడా?"

సుబ్బారావు ఆలోచనలో పడటం చూసిన ప్రకాశం "నిజం చెప్పు, సుబ్బారావు! మీ భార్యాభర్తలిద్దరూ అన్నిసార్లు సినిమా కెళ్లారు కదా! ఒక్కసారైనా 'నాన్నా! నీవు కూడా మాతో రా!' అని మనస్ఫూర్తిగా మీ నాన్నని అడిగావా?" ఆవేశంగా ప్రశ్నించాడు ప్రకాశం.

"నిజమే అంకుల్! మా నాన్నకి సినిమాలంటే చాలా ఇష్టం కూడా! ఈ రోజుకీ మా ఊళ్లో చూస్తూనే ఉంటాడు. ఈ సంగతి తెలిసి కూడా నెగ్లెక్ట్ చేశాను!" సుబ్బారావు తల దించుకున్నాడు.

"నీవే కాదు, సుబ్బారావు! నేను కూడా నీలాగానే ప్రవర్తించాను. నాన్నను నాన్నలాగానే కాకుండా నాన్నను కూడా అమ్మలాగానే ప్రేమిద్దాం, ఆదరిద్దాం!" అంటున్న ప్రకాశం గొంతు ఎందుకో జీరపోయింది.

ప్రకాశం చెప్పినదానికి సుబ్బారావు మౌనంగా తలూపాడు.

ప్రకాశం ఆశించిన మార్పు సుబ్బారావులో చూడకుండానే అతని తండ్రి ఆ రోజు రాత్రి బస్సుకు వాళ్ల ఊరు వెళ్లిపోయాడు. ■

### ఏమైంది?

**వివేక్:** పెద్దలనెదిరించి ఎలాగైనా పెళ్లి చేసుకుని తీరుతానన్నావు...ఏమైంది?

**ప్రేమిక్:** ఏంచెప్పాలి...గుళ్లో దండలు మార్చుకుందామంటే ఆమెతండ్రి గుడిపూజారి! పోనీ రిజిస్టర్ మారేజ్ చేసుకుందామంటే మానాన్న అక్కడ మారేజ్ ఆఫీసర్!

**పూరె మంజులారావు,** కొండపర్తి